క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభువు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామికి కాయకర్పూరం సమర్పించుకున్నారు. ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

ట్రాఫిక్‌పై పోలీసుల స్పెషల్ డ్రైవ్



డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ కొండారెడ్డి

పోరుమామిళ్ల : పట్టణ ప్రధాన రహదారిలో దుకాణాల ఎగుట అడ్డగా నిలిపిన వాహనాలపై పోలీసులు శనివారం సాయంత్రం చర్యలకు ఉపక్రమించారు. ఎస్ఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రోడ్డుపై బైక్‌లు పెడితే చర్యలు తీసుకుంటామని దుకాణ దారులు, బైక్ యజమానులను ఆయన హెచ్చరించారు. జూనియర్ కళాశాల మైదానం బయట బాడుగ కార్లను రోడ్డుపై పెట్టడంతో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

హంస వేద యోగపై అవగాహన



హంసవేద యోగపై అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వర్లు

పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సాయంత్రం విద్యార్థులకు హంస వేద యోగపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మౌంట్ కైలాష్ గురూజీ శిష్యుడు ట్రైనర్ పెసల వెంకటేశ్వర్లు హంస వేద యోగ ప్రాధాన్యం, ప్రయోజనాలు వివరించారు. యోగ సాధనతో ఒత్తిడి నుంచి విముక్తులవుతారని, జ్ఞాపకశక్తి పెరుగుతుందని, నిత్య జీవితంలో ఉల్లాసంగా ఉంటారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కళ్యాణ్‌కుమార్, అధ్యాపకులు సులోచన, శ్రీధరమూర్తి, శివారెడ్డి, నగేష్, గురమ్మ, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

సీబీఐటీలో క్యాంపస్ ప్లేస్‌మెంట్



క్యాంపస్ సెలక్షన్‌లో ఉద్యోగాలకు ఎంపికైన సీబీఐటీ విద్యార్థులు

చాపాడు : స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)కాలేజీలో శనివారం ఎంబీఏ, బీటెక్ పూర్వపు విద్యార్థులకు కెనర హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సురెన్స్ సంస్థ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో 85 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కంపెనీ బిజినెస్ హెచ్ఆర్ వినోద్, రీజనల్ హెడ్ నరేంద్ర ఆధ్వర్యంలో ఎంపిక జరిగాయి. విద్యార్థులకు గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహించగా ఏడు మంది విద్యార్థులు రిలేషన్‌షిప్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి సంవత్సర ఆదాయం రూ.2.5 లక్షలు ఉంటుందని తెలిపారు. తమ కాలేజీ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికవటం పట్ల సీబీఐటీ చైర్మన్ వి.జయచంద్రారెడ్డి, డైరెక్టర్ అడ్మిన్ జి.శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపాల్ శృతి హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ ఈఈకి వినతి



ఈఈ రమణారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు

ప్రొద్దుటూరు : ఎస్క్రో అకౌంట్ ద్వారా నేరుగా తమకు జీతాలు చెల్లించాలని ప్రొద్దుటూరు విద్యుత్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణారెడ్డికి శనివారం ప్రొద్దుటూరు డివిజన్ విద్యుత్ మీటర్స్ రీడర్స్ యూనియన్ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు విద్యుత్ మీటర్ రీడర్లకు ఎస్క్రో అకౌంట్ ద్వారా నేరుగా జీతాలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఆమేరకు తమకు జీతాలు ఇవ్వాలని ఈఈని కోరారు. స్పందించిన ఈఈ రమణారెడ్డి డివిజన్ పరిధిలోని కాంట్రాక్టర్లతో మాట్లాడి ఎస్క్రో అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలని ఆదేశిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గఫార్‌బాషా, లక్ష్మీనారాయణ, రమణ, సుబ్బారెడ్డి, సునీల్, గోపాల్, ప్రసాద్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

కేసీ గలగల... నాట్లు కళకళ

కేసీ చాపాడు కాలువలో నీరు గలగలా పారడంతో జోరుగా నాట్లు వేస్తున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో రైతులు మడులకు నీళ్లు పెట్టుకుంటూ, ట్రాక్టరుతో దమ్ము చేసుకుంటూ, ఎద్దులతో మాను తోలుకుంటూ, మడిలో ఎరువులు చల్లుకుంటూ, నారు తుంచుతూ, వరినాట్లు వేసుకుంటూ తమ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. ఆప్రాంతంలోకి పోతే చల్లని వాతావరణం, ఓమ్మా తొందరగా రాండి, ప్రొద్దుకూక ముందే నాటు అయిపోజేసుకొని ఇంటికి పోదాం. ఓచిన్నక్క రెండు నారుకట్టలు ఇట్లెయ్.. అంటూ వాళ్ల నోటి నుంచి ఇలాంటి మాటలే జాలువారుతున్నాయి. దాదాపు 680 ఎకరాల్లో వరినాట్లు వేస్తున్నారు.

– రాజుపాళెం



కేసీ చాపాడు కాలువలో పారుతున్న నీరు



మడిలో ట్రాక్టరుతో దమ్ము చేస్తున్న దృశ్యం



కేసీ కెనాల్ పరిధిలో వరినాట్లు వేస్తున్న కూలీలు

సీసీ రోడ్లకు భూమిపూజ



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తున్న స్పెషల్ కలెక్టర్ కౌసర్‌బాను

గోపవరం : మండలంలోని గోపవరం ఎస్టీకాలనీ, శ్రీనివాసపురం ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి మండల ప్రత్యేకాధికారి కె.కౌసర్‌బాను, టీడీపీ సమన్వయకర్త రితీష్‌రెడ్డి శనివారం భూమి పూజ చేశారు. ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గోపవరం ఎస్టీ కాలనీలో రూ.7 లక్షలు, శ్రీనివాసపురం ఎస్సీ కాలనీలో రూ.6.50 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. శ్రీనివాసపురంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని వంద రోజుల్లో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ధనలక్ష్మి, ఎంపీడీఓ రామకృష్ణయ్య, ఈఓపీఆర్‌డీ హసీనా, మండల టీడీపీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ సమన్వయకర్త రాకకై నిరీక్షణ

మండలంలోని శ్రీనివాసపురంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి స్పెషల్ కలెక్టర్‌తోపాటు అన్నిశాఖల అధికారులు నిర్దేశించిన సమయానికి రాగా టీడీపీ సమన్వయకర్త రితీష్‌రెడ్డి కోసం గంటల తరబడి వేచియుండాల్సిన పరిస్థితి. ముందుగా గ్రామసభ నిర్వహించాల్సి ఉండగా కార్యక్రమానికి ప్రజలు ఎవరూ రాకపోవడంతో సీసీ రోడ్ల భూమి పూజకు స్పెషల్ కలెక్టర్‌తో పాటు అధికారులు వెళ్లారు. అక్కడ టీడీపీ సమన్వయకర్త రితీష్ రెడ్డి రాక కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. చివరికి మధ్యాహ్నం 12 గంటలకు ఆయన రాకతో భూమి పూజ నిర్వహించి అనంతరం గ్రామసభ నిర్వహించారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏడీఏ ఎం.నాగరాజు

అట్లూరు : రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించేలా చర్యలు చేపట్టాలని బద్వేల్ వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజు అన్నారు. బద్వేల్ వ్యవసాయ డివిజన్ కార్యాలయంలోని బద్వేల్, అట్లూరు, గోపవరం, సిద్దవటం మండలాల వ్యవసాయాధికారులు, రైతు సేవా కేంద్రాల సమాయకులకు ఒక్క రోజు శిక్షణ, సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ అన్ని మండలాల పరిధిలోని గ్రామాలలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారన్నారు. రైతులను ఆధునిక వ్యవసాయవైపు అడుగులు వేసేలా చర్యలు చేపట్టడంతోపాటు రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ల వాడకం, ఉపాధి ద్వారా పండ్లతోటల పెంపకం, పశువుల షెడ్ల నిర్మాణం, తదితర కార్యక్రమాలు వివరించాలని తెలిపారు. అనంతరం గోడ పత్రాలను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో రమేష్‌కుమార్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, మాధురి, ఒంటిమిట్ట ఏకశిలా ఆర్గానిక్ రైతు ఉత్పత్తి దారులు సంఘం సీఈఓ మౌనిక, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం ఎస్‌జీఎఫ్ఐ అండర్–14, 17 బాలబాలికలకు వాలీబాల్, చెస్, యోగా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో మండలంలోని పలు పాఠశాలలకు చెందిన 500 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలను పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ బాలరాజు, ప్రధానోపాధ్యాయుడు సురేష్‌బాబు ప్రారంభించారు. క్రీడాకారులు తమ నైపుణ్యంతో అందరిని ఆకట్టుకున్నారు. క్రీడాకారులకు కల్లూరు, రేగుళ్లపల్లె గ్రామ ప్రజలు, పాఠశాల పూర్వ విద్యార్థులు అతిథి భోజన వసతి కల్పించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు ఈనెల 25న జరిగే నియోజక వర్గస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ పోటీలను ఎంఈఓ సావిత్రమ్మ, ఆర్గనైజర్లు షేక్ బాబు, ఓబయ్య, పీడీ అల్లాబకాష్ పర్యవేక్షించారు. అలాగే రాయలసీమ వ్యాయామ విద్య కళాశాలలో నియోజకవర్గ స్థాయిలో అండర్–14, 17 బాలబాలికలకు అథ్లెటిక్స్ 24న, గేమ్స్ 25న ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు నడిగడ్డ సుధాకర్, ప్రసాద్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికై క్రీడాకారులు తమ ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పెన్నానది తీరంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీ అమృతేశ్వరస్వామి, శ్రీస్వామి అయ్యప్ప సేవా సంఘం సభ్యుల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కొవ్వూరు రమేష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో నూతన కమిటీ, ఆఫీస్ బేరర్స్ నియామకం, దసరా ఉత్సవాలపై చర్చ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రెండు దేవస్థానాల ప్రస్తుత కమిటీ, మాజీ కమిటీ ప్రతినిధులందరూ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి

బద్వేలు అర్బన్: పట్టణంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్ పేర్కొన్నారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు ఫాతిమా, ఖలీల్‌బాష, సహాయ కార్యదర్శులు యువరాజ్, మాపీరా, రాజు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

పోరుమామిళ్ల : సీతారామపురం క్రాస్ రోడ్ వద్ద అక్రమంగా మద్యం తీసుకెళ్తున్న తాతన బోయిన శ్రీనివాసులును అరెస్టు చేసి అతడి నుంచి 12 180 ఎంఎల్ విస్కీ బాటిల్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. దీనిపై శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశామన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

దువ్వూరు : మండలంలోని మూడిండ్లపల్లె పొలాల్లో శనివారం పేకాట ఆడుతున్న ఐదు మందిని శనివారం అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ.66,700 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. మండలంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

అక్రమ ఇసుక ట్రాక్టర్ సీజ్

చాపాడు : మండల పరిధిలోని రాజుపాళెం గ్రామ సమీపంలో శనివారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేశామని, ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్ గురువయ్యను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

ప్రొద్దుటూరు : బెంగళూరులో ఈనెల 23, 24, 25 తేదీల్లో నిర్వహించే మోటార్ వర్కర్స్ 18వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆటో వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు వై.హరి తెలిపారు. శనివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ జాతీయ మహాసభల్లో భవిష్యత్తు పోరాటాలకు సంబంధించిన నిర్ణయాలను ప్రకటిస్తారని తెలిపారు. మహాసభలకు కర్ణాటక ట్రాన్స్‌పోర్టు మంత్రి రామలింగారెడ్డి, ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ అమర్జిత్ కౌర్, ప్రెసిడెంట్ అనంత సుబ్బారావు, ఎస్ఎఫ్ఐఆర్‌టీడబ్ల్యూ వైస్ ప్రెసిడెంట్ ఎంఎల్ యాదవ్ తదితర ప్రముఖులు హాజరవుతారన్నారు. జాతీయ మహాసభల్లో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ పట్టణ సహాయ కార్యదర్శి మచ్చ శీను, ఉపాధ్యక్షులు ఎల్లయ్య, నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

పరిశుభ్రతకు తొలి ప్రాధాన్యం



ప్రొద్దుటూరు : గాంధీ పార్కులో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి



ర్యాలీ నిర్వహిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ శివప్రసాద్ తదితరులు

ప్రొద్దుటూరు : ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ గాంధీ పార్కులో శనివారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మన చుట్టు పరిసరాలు శుభ్రంగా ఉంటే వ్యాధులు రావని తెలిపారు. ప్రజలు మురికి కాలువల్లో చెత్తను వేయకుండా చెత్త సేకరణకు కోసం మీ ఇళ్ల వద్దకు వచ్చే శానిటరీ సిబ్బందికి చెత్తను ఇవ్వాలని సూచించారు. అనంతరం పార్కును శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్ బాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక శంకర్‌రావు వీధిలో మురికి కాలువల్లో పూడికతీత పనులను మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఇంజనీర్ సాయికృష్ణ పర్యవేక్షించారు.

దువ్వూరు : పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని దువ్వూరు ఇన్‌చార్జి ఎంపీడీఓ శివప్రసాద్ తెలిపారు. శనివారం దువ్వూరు ఎంపీడీఓ కార్యాలయం నుంచి మూడు రోడ్ల కూడలి వరకు స్వచ్ఛతా హీ సేవా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం వల్ల సీజనల్ వ్యాధుల బారినపడకుండా ఉంటారని తెలిపారు. అనంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటామని ప్రజలు, సచివాలయ, ఉపాధి హామీ పథకం, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో దువ్వూరు సర్పంచ్ చెంద్రాయుడు, ఎంపీడీఓ ఆఫీసు సూపరింటెండెంట్ నాగేంద్రబాబు, ఉపాధి హామీ పథకం ఏపీఓ డాక్టర్ వసంతకుమార్ పాల్గొన్నారు.

భక్తుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తున్నారు

చాపాడు : తిరుమల లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు నుంచి తయారు చేసిన నెయ్యి వాడారంటూ నీచంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడటం కోట్లాది మంది భక్తుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయడమేనని వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన వైఫల్యం కావడంతో దారి మళ్లించేందుకు ఇలాంటి నీచ రాజకీయాలు చేయడం సిగ్గు చేటని విరుచుకుపడ్డారు. దీనిని బీజేపీ నేత, వీహెచ్‌పీ, టీటీడీ ఉద్యోగులు సైతం నమ్మలేదనటానికి బీజేపీ నేత, మాజీ ఐఏఎస్ అధికారి ఐవైఆర్ కృష్ణారావు, వీహెచ్‌పీ దక్షిణాంధ్ర రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, టీటీడీ ఉద్యోగ, కార్మిక సంఘాల గౌరవాధ్యక్షుడు కందారపు మురళీ వాఖ్యలు ప్రత్యక్ష నిదర్శనాలని రెడ్యం వివరించారు. చంద్రబాబు నీచ వాఖ్యలపై సిటింగ్ జడ్జీతో విచారణ చేయించాలని టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి హై కోర్టును కోరడం నాటి వైఎస్ జగన్ ప్రభుత్వ చిత్తశుద్ధికి ప్రత్యక్ష నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి నీచ వాఖ్యలతో చంద్రబాబు ఇమేజ్ అధఃపాతాలానికి చేరిందన్నారు.

మాదక ద్రవ్యాలకు బానిసైతే భవిష్యత్తు నాశనం



మాట్లాడుతున్న రూరల్ సీఐ నాగభూషణం

బద్వేలు అర్బన్ : మాదక ద్రవ్యాలకు బానిసైతే భవిష్యత్తు నాశనమవుతుందని అర్బన్, రూరల్ సీఐలు రాజగోపాల్, నాగభూషణం పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో జరిపిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకంతో మనిషి విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వం నార్కోటిక్ డ్రగ్స్ ఎన్‌డీపీఎస్ చట్టం తీసుకొచ్చిందని, మత్తు పదార్థాలు సరఫరా చేసినా, వినియోగించినా కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారెడ్డి, కళాశాల చైర్మన్ రాచపూడి వెంకటసాయిక్రిష్ణ, ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఎస్ఆర్‌హెచ్‌ఆర్‌సీ ట్రస్టు సభ్యులు వంశీకృష్ణ, రామ్మోహన్‌రెడ్డి, విజయ్, మాలకొండయ్య, విజయకుమార్, భారతిలక్ష్మి, కవిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ



గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న ఫాతిమా స్కూల్ యాజమాన్యం

బద్వేలు అర్బన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల పోటీల్లో పట్టణంలోని ఫాతిమా ఇంగ్లీషు మీడియం పాఠశాల, రత్నం ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూసి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గోపవరం మండలం రాచాయపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో ఫాతిమా స్కూల్ విద్యార్థులు అండర్–17 బాలుర వాలీబాల్, కబడ్డీ, అండర్–17 బాలికల కబడ్డీ, ఖోఖో పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. అండర్–14 బాలుర వాలీ బాల్, కబడ్డీ, బాలికల కబడ్డీ, ఖోఖో పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. రన్నింగ్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, హైజంప్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు కై వసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సిస్టర్ జ్యోతిష్యా విద్యార్థులతోపాటు వ్యాయామోపాధ్యాయులు మోహన్‌ను అభినందించారు. బద్వేలు మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో రత్నం ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు ఖోఖో, వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. పాఠశాల కరస్పాండెంట్ టి.రత్నం విద్యార్థులను అభినందించారు.

అర్బన్ సీడీపీఓపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు : అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు అనర్హుల నుంచి దరఖాస్తులు తీసుకున్న ఐసీడీఎస్ అర్బన్ సీడీపీఓ హైమావతిపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ సుబ్బిరెడ్డి కొట్టాలు అంగన్‌వాడీ కేంద్రం–1లో అంగన్‌వాడీ కార్యకర్త బీసీ–సీ కేటగిరికి నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. దీనికి సంబంధించి గడువు దాటిన తర్వాత సీడీపీఓ నకిలీ దరఖాస్తు తీసుకున్నారన్నారు. సీడీపీఓపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ ఏరియా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గురజాడ అప్పారావు జయంతి



గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కాశినాయన : ప్రపంచం ఎటుపోతుందో గమనించి రచనలు చేసిన తొలి మేధావి మహాకవి గురజాడ వెంకట అప్పారావు అని ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్ పేర్కొన్నారు. గురజాడ జయంత్రి సందర్భంగా మండలంలోని రెడ్డి కొట్టాల ప్రాథమికోన్నత పాఠశాలలో గురజాడ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనిషి చేతిలో రాతిలో దేవుడిని చూడగలిగినప్పుడు మనిషిలో మాత్రం ఆ దేవుడిని ఎందుకు చూడలేరని మానవాళిని సూటిగా ప్రశ్నించి తాత్వికుడు గురజాడ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాకా చంద్రశేఖర్, సురేష్‌కుమార్, పరిమళజ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

టీఎల్‌ఎంలతో పాఠశాలలు బలోపేతం



టీఎల్‌ఎం సామగ్రిని ప్రారంభిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

చాపాడు : టీచింగ్ లర్నింగ్ మెటీరియల్(బోధన అభ్యసన సామగ్రి) ద్వారా బోధించడం వలన ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమవుతాయని మండల విద్యాధికారి రవిశంకర్ తెలిపారు. నక్కలదిన్నె గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో శనవారం అమెరికాకు చెందిన ఎన్ఆర్ఐ గోరంట్ల వాసుబాబు రూ.30వేలు విలువ చేసే టీఎల్‌ఎం సామగ్రిని పాఠశాలకు అందజేశారు. ఎంఈఓ వీటిని ప్రారంభించి మాట్లాడారు. టీచింగ్ లర్నింగ్ మెటీరియల్ ద్వారా బోధించడం వలన విద్యార్థులకు అర్థవంతమైన విద్య అందుతుందన్నారు. ఇలాంటి విద్యను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. దాతలు స్పందిస్తే టీఎల్‌ఎం లను అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 వంశీకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు శోభన్‌బాబు, ఉపాధ్యాయులు కృష్ణయ్య, అనిత, రాధమ్మ, అబ్దుల్ అజీమ్, కాంప్లెక్స్ సెక్రెటరి ఏ.శ్యాంసుందర్‌రెడ్డి, సుంకులవారిపల్లె స్కూల్ హెచ్ఎం నాగలక్ష్మీదేవి, ఉపాధ్యాయులు అరుణ, కమలమ్మ, ప్రభాకర్‌రెడ్డి, అల్లి, రామసుబ్బారెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అడివయ్య స్థలం కాపాడండి

అట్లూరు : అడివయ్య సత్రంతోపాటు అడివయ్యకు గతంలో ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా చూడాలని అట్లూరు గ్రామ ప్రజలు శనివారం తహసీల్దారు రవిశంకర్‌కు ఫిర్యాదు చేశారు. కడప–బద్వేలు ప్రధాన రహదారి అనుకుని అడివయ్య సత్రంతోపాటు అడివయ్య సమాధి కొన్ని దశాబ్దాల కాలం నుంచి ఉంది. ప్రభుత్వం ఆ సత్రం, సమాధి కోసం కొంత స్థలం కేటాయించింది. అయితే ఆ స్థలం విలువైనది కావడంతో కొంత మంది కన్ను పడింది. కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామస్తులు తహసీల్దార్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అందుకు తహసీల్దారు స్పందిస్తూ అడివయ్య స్థలం అన్యాక్రాంతం కాకుండా చూస్తామని తెలిపారు.

ఓటమి గెలుపునకు తొలిమెట్టు

రాజుపాళెం : క్రీడల్లో ఓటమి గెలుపునకు తొలి మెట్టు అని రాజుపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం వేలంగ్ కుమార్ అన్నారు. మండల కేంద్రమైన రాజుపాళెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండోరోజైన శనివారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్ ఆటల పోటీలను హెచ్ఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పోటీల్లో పాల్గొనాలని సూచించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్‌బాట్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించినట్లు పీడీ సుబ్బయ్య తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు.

ఈ క్రీడల్లో గెలుపొందిన వారంతా ఈ నెల 24వ తేదీన ప్రొద్దుటూరులో నియోజకవర్గ స్థాయిలో జరగబోవు పోటీల్లో పాల్గొనాలని సుబ్బయ్య చెప్పారు. అక్కడ కూడా ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రజల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. మండలంలోని సోమువారిపల్లె పంచాయతీ ఈశ్వర్‌రెడ్డినగర్‌లో ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రజావేదికలో ఆయన మాట్లాడారు.

మెప్మా బజార్ ప్రారంభం

స్థానిక శివాలయం సర్కిల్ వద్ద మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను శనివారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల సభ్యులు తయారు చేసిన వాటిని ఈ మార్కెట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, మెప్మా టీఈ కెజియా తదితరులు పాల్గొన్నారు.